ప్రజాశక్తి

బుధవారం 24 డిసెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

జగదాంబ జంక్షన్‌లో ఐద్వా నాయకుల ప్రచారం

గోపాలపట్నం సభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

కార్మికోద్యమాల సారథి సిఐటియు

అఖిల భారత మహాసభ జయప్రదానికి హోరెత్తుతున్న ప్రచారం

ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖలో జరుగనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రచారం జోరందుకుంది. బహుముఖ కార్యక్రమాలతో కార్మిక వర్గం మహాసభ విశిష్టతను, సిఐటియు గొప్పతనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. అన్ని తరగతుల నుంచీ ఈ ప్రచారానికి విశేష స్పందన లభిస్తోంది. ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్‌లో ప్రచార కార్యక్రమం చేపట్టారు. తొలుత సిఐటియు కార్యాలయం నుంచి మహిళలు ర్యాలీగా జగదాంబ జంక్షన్‌కు చేరుకొని అక్కడ నుంచి క్లాక్ టవర్, లేపాక్షి జంక్షన్ మీదుగా ప్రచారం కొనసాగించారు. మద్దిలపాలెం బస్‌స్టాప్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. గోపాలపట్నం పెట్రోల్ బంకు వద్ద జరిగిన సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.

(వార్తలు 8లో..)

జగదాంబ సబ్ రిజిస్ట్రార్‌పై ఎసిబి దాడులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగదాంబ సెంటర్ సబ్ రిజిస్ట్రార్ ఎస్.మోహనరావు ఇంటిపై మంగళవారం ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్‌లు, కార్యాలయ సిబ్బంది ఇళ్లలో ఏకకాలంలో మంగళవారం జరిపిన ఆకస్మిక తనిఖీల్లో భాగంగా విశాఖలోనూ నిర్వహించారు. గత నెల 5న జగదాంబ సెంటర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఎసిబి అధికారులు ఆకస్మికంగా దాడి చేసి, లెక్కలో తేలకుండా, అనధికారికంగా రూ.10 వేలు కలిగి ఉన్నట్లు గుర్తించి సబ్ రిజిస్ట్రార్ మోహనరావుపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆయన ఇంటిపై దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. తాజా దాడులు చర్చనీయాంశమయ్యాయి.

విశాఖలో మెరిసిన షెఫాలీ

లంకపై భారత్ వరుస విజయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీలంక - భారత్ మహిళా జట్ల మధ్య స్థానిక ఎసిఎ - విడిసిఎ క్రికెట్ మైదానంలో మంగళవారం రాత్రి జరిగిన టి 20 మ్యాచ్‌లో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. తాజా మ్యాచ్‌లో భారత్ మహిళల జట్టు ఏడు వికెట్ల తేడాతో లంక జట్టుపై విజయం లిఖించింది. భారత ఓపెనర్ షెఫాలీ వర్మ 27 బంతుల్లోనే అర్ధ సెంచరీని అందుకుంది. మొత్తంగా ఆమె 34 బంతుల్లో 69 పరుగులు చేసింది. ఇక తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టు 128 పరుగులు మాత్రమే చేసింది. ఆ పరుగులను భారత్ సునాయాసంగా అందుకుంది. ఈ మ్యాచ్‌కు క్రీడాభిమానులు భారీగా తరలివచ్చారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించాలి

▶ వార్త 5లో..

పూర్ణా మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం

▶ వార్త 2లో..

వచ్చే నెలలో వైద్యుల నియామకానికి చర్యలు

▶ వార్త 7లో..

మాట్లాడుతున్న తోట త్రిమూర్తులు

హెచ్ఐవి కేసులు తగ్గుముఖం

శాసనసభ సబార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్ తోట త్రిమూర్తులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో హెచ్ఐవి కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టిందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ సబార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. కమిటీ రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం కెజిహెచ్‌లో గైనకాలజీ వార్డును పరిశీలించి అక్కడ వైద్యం తీసుకుంటున్న వారిని కలసి వారికి అందుతున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్లుగా హెచ్ఐవి, ఎయిడ్స్ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో మహారాష్ట్ర తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నప్పటికీ గతంతో పోలిస్తే అవగాహన పెరగడం వల్ల కేసుల సంఖ్య తగ్గిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను బాధితులకు క్రమం తప్పకుండా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారని మిగతా 2లో..

ఘనంగా పీసా మహోత్సవ్

ప్రజాశక్తి - సీతమ్మధార

విశాఖలోని పోర్టు స్టేడియం వేదికగా రెండు రోజులపాటు తలపెట్టిన పీసా మహోత్సవ్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. కేంద్ర పంచాయతీరాజ్ జాయింట్ సెక్రటరీ ముక్తా శేఖర్, ఎపి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, ఆర్చరీ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి సురేఖ పాల్గొని ఉత్సవ్‌ను ప్రారంభించారు. ముందుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన గిరిజనులు ఏర్పాటు చేసిన 68 స్టాళ్లను లాంఛనంగా ప్రారంభించి అక్కడ ప్రదర్శనలో ఉంచిన గిరిజన ఉత్పత్తులను, సంప్రదాయ వంటకాలను అతిథులు పరిశీలించారు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన గిరిజన మహిళలు కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, మంగళగిరి, వెంకటగిరి చీరలు, చేనేత ఉత్పత్తులు, సంప్రదాయ ఆహార ఉత్పత్తులు, బొంబో చికెన్ తదితర ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. మరోపక్క ఖేలో ఇండియా కబడ్డీలో 10 రాష్ట్రాల నుంచి 18 టీంలు భాగస్వామ్యమయ్యాయి. అందులో పురుష జట్లు 10, మహిళా జట్లు 8 పాల్గొన్నాయి. ఉదయం నుంచి రసవత్తరంగా సాగిన కబడ్డీ పోటీలను చూసేందుకు అందరూ ఆసక్తి కనబరిచారు. పురుషుల టీముల్లో మధ్యప్రదేశ్ విజేతగా నిలవగా, రన్నర్ జట్టుగా ఒడిశా టీం, మూడో స్థానంలో తెలంగాణ, గుజరాత్ జట్లు నిలిచాయి. మహిళల విభాగంలో విజేతగా జార్ఖండ్ జట్టు నిలవగా, రన్నర్‌గా మధ్యప్రదేశ్ జట్టు నిలిచింది. మూడో స్థానంలో మహారాష్ట్ర, ఒడిశా జట్లు నిలిచాయి. ఆర్చరీ క్రీడా పోటీల్లో 8 రాష్ట్రాలకు చెందిన 20 మంది క్రీడాకారులు ఉత్సాహంగా భాగస్వామ్యమయ్యారు. అందులో పురుషులు 12 మంది, మహిళలు 8 మంది పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పురుషుల వ్యక్తిగత విభాగంలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కృష్ణా పింగువా బంగారు పతకం, రాజస్థాన్‌కు చెందిన బద్రీ లాల్ మీనా రజత పతకం సాధించారు. మూడో స్థానంలో నిలిచిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మిగతా 2లో..

గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న ఉన్నతాధికారులు

మొదటి పేజీ తరువాయి..

ఘనంగా పీసా మహోత్సవ్

దినేష్ ముర్ముకు కాంస్య పతకం దక్కింది. మహిళల వ్యక్తిగత విభాగంలో రాజస్థాన్‌కు చెందిన ఖుషీ నసోమాకు బంగారు పతకం, జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అనురాధ కుమారికి రజతం, ఒడిశా రాష్ట్రానికి చెందిన అంబికా పాండేకు కాంస్య పతకం దక్కాయి. ఉత్సవాల్లో భాగంగా పది రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పలు రకాల విన్యాసాలు, నైపుణ్యాలు ప్రదర్శించారు. తొలుత ఆర్‌కె బీచ్ కాళీ మాత ఆలయం నుంచి 10కె రన్ చేపట్టారు. అర్జున అవార్డు గ్రహీత జ్యోతి సురేఖ ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

ఉత్సాహంగా 10కె రన్

ఎంవిపి.కాలనీ : పీసా మహోత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం ఆర్కే బీచ్ కాళీమాత టెంపుల్ నుండి తెన్నేటి పార్క్, తెన్నేటి పార్క్ నుంచి కాళీమాత టెంపుల్ వరకు 10కె రన్ నిర్వహించారు. ప్రముఖ ఆర్చరీ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి సురేఖ ఈ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్ జాయింట్ సెక్రటరీ ముక్తా శేఖం, ఎపి పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ, ఎపిఎస్ఐఆర్‌డి కమిషనర్ ముత్యాలరాజు, జెడ్‌పి సిఇఒ నారాయణమూర్తి, డిఎస్‌డిఒ జూన్ గ్యాలియట్, పంచాయితీరాజ్, ఇతర అధికారులు, వైజాగ్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విజేతలు వీరే

పురుషుల్లో మహారాష్ట్రకు చెందిన అతుల్ చిత్తోడ్, సూరజ్ మాషి, మనోజ్ హిలిన్ 10కె రన్ పూర్తి చేసి 1, 2, 3 స్థానాల్లో నిలిచారు.

మహిళల్లో రాజస్థాన్‌కు చెందిన రాజకుమారి, జార్ఖండ్‌కు చెందిన హీరా సంఘు, హిమాచల్ ప్రదేశ్‌కి చెందిన ప్రియా రన్ పూర్తి చేసి వరుసగా 1, 2, 3 స్థానాల్లో నిలిచారు

హెచ్‌ఐవి కేసులు తగ్గుముఖం

వెల్లడించారు. ఎయిడ్స్ ప్రాణాంతక వ్యాధి కాదని, సరైన మందులు వాడితే సాధారణ జీవితం గడపవచ్చని, ప్రజల్లో అవగాహన పెరిగిందని పేర్కొన్నారు. పీజీ వైద్య విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన 85, 127 జిఒలను సమీక్షించినట్లు తెలియజేస్తూ ప్రభుత్వ కోటా కింద రాయితీలు, స్టైపెండ్ పొందే వైద్యులు కనీసం 10 ఏళ్ల పాటు గ్రామీణ ప్రాంతాల్లో లేదా ప్రభుత్వ సేవలో పనిచేయాలనే నిబంధనను గుర్తు చేశారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే సదరు వైద్యుల పీజీ సర్టిఫికెట్లు రద్దు చేయడంతో పాటు రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ నియంత్రణపై సోషల్ మీడియా వేదికగా మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ సూచించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో కమిటీ గమనించిన అంశాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బండారు శ్రావణిశ్రీ, కన్నా లక్ష్మీనారాయణలతో పాటు వి.విశ్వనాథం, ఎపిఎల్‌ఎ అసిస్టెంట్ సెక్రటరీ డాక్టర్ కె.పద్మావతి, ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్‌ఎం.సంధ్యాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

తెల్ల రేషన్ కార్డుపై గోధుమపిండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లాలోగల తెల్ల రేషన్ కార్డుదారులకు 2026 జనవరి నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థలో బియ్యం, పంచదార, రాగులుతో పాటు గోధుమపిండి కూడా అందజేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్ పరిధిలోగల ప్రతి కార్డుదారునికీ కేజీ గోధుమ పిండిని రూ.16కు పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రజలకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.

రోబోటిక్ సర్జరీతో కిడ్నీ చికిత్సలో నూతన శకం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం ఎఐఎన్‌యు ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీలతో కిడ్నీ చికిత్సలో కొత్త ప్రమాణాలను ఆవిష్కరించడం హర్షించదగిన విషయమని విశాఖ ఎంపి మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. దక్షిణ నియోజకవర్గం ద్వారకానగర్ మొదటి వీధిలో ఉన్న ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఎఐఎన్‌యు)లో ప్రవేశపెట్టిన రోబోను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీని ప్రవేశపెట్టడం అనేది కొత్తశకం అవుతుందన్నారు. విశాఖ పురోగతిని ఇలాంటి అత్యాధునిక టెక్నాలజీలు రుజువు చేస్తాయన్నారు. కిడ్నీ చికిత్సల్లో రోబోటిక్ విధానం వల్ల రోగులకు సురక్షితమైన చికిత్స, వేగంగా కోలుకోవడం సాధ్యమవుతాయన్నారు. ఎఐఎన్‌యు విశాఖ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్, యూరో ఆంకాలజిస్ట్, లాపరోస్కాపిక్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ జి.రవీంద్రవర్మ మాట్లాడు తూ, ఈ అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో తాము సంక్లిష్టమైన సర్జరీలను కూడా కచ్చితత్వంతో చేయగలమన్నారు.రోగికి నొప్పి తగ్గుతుందని, మచ్చలు ఉండవని, త్వరగా కోలుకుంటారన్నారు. ప్రొస్టేటిక్ క్యాన్సర్ కేసుల్లో, ముఖ్యంగా రాడికల్ ప్రొసెక్టమీ చేయాల్సి వచ్చినప్పుడు కణితిని కచ్చితంగా తీయగలమ న్నారు. రక్తస్రావం తగ్గుతుందన్నారు. ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, యూరోఆంకాలజిస్ట్, లాపరోస్కాపిక్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ అమిత్ సాప్లే మాట్లాడుతూ, సంక్లిష్టమైన సమస్యలకు రోబోటిక్ సర్జరీలు సమూలంగా మారుస్తాయన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఆస్పత్రి సిఇఒ సందీప్ గూడూరు తదితరులు మాట్లాడారు.

పూర్ణా మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం

రూ.50 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నంలో ఎంతో ప్రసిద్ధి చెందిన పూర్ణా మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున పూర్ణా మార్కెట్‌లో పూజా సామగ్రి విక్రయించే దుకాణాల వద్ద అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందడంతో అగ్నిమాపక దళ సిబ్బంది, పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో 16 దుకాణాలు దగ్ధమయ్యాయి. వీటిలో 14 పూజా సామగ్రి విక్రయించే దుకాణాలు ఉండగా, మరో రెండు ఉసిరికాయలు, వెలంకాయలు, మామిడి ముక్కలు, ప్లాస్టిక్ సామగ్రి విక్రయించే షాపులు ఉన్నాయి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని సూర్యాబాగ్ అగ్నిమాపక శాఖ అధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. ప్రమాద వార్త తెలియడంతో ఉదయం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సంబంధిత అధికారులతో కలిసి పూర్ణా మార్కెట్‌కు వెళ్లి ప్రమాదంలో దగ్ధమైన దుకాణాలను పరిశీలిం చారు. బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వపరంగా తగిన ఆర్థిక సాయం అందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావు కూడా ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదం జరగడం వల్ల ఎటువంటి ప్రాణ నష్టమూ జరగలేదన్నారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ప్రాంతంలో ఇద్దరు వాచ్‌మ్యాన్లను ఏర్పాటు చేయాలని, నైట్ పెట్రోలింగ్ కోసం పోలీసులకు తెలపాలని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడును ఆదేశించారు. రాష్ట్రంలోనే ఒక ఆధునిక మార్కెట్‌గా పూర్ణా మార్కెట్‌ను తీర్చిదిద్దడానికి అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, డిడిహెచ్ దామోదర్ రావు, తాగునీటి విభాగం, పబ్లిక్ వర్క్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కూడా పూర్ణా మార్కెట్ అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. వన్ టౌన్ పోలీసులు ప్రమాదంపై ఆరా తీశారు.

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన దుకాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

నీరుస్ న్యూలుక్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ప్రముఖ భారతీయ సంప్రదాయ వస్త్ర వ్యాపార సంస్థ 'నీరుస్' తన ఫ్లాగ్‌షిప్ స్టోర్ సిరిపురం సంపత్ వినాయక ఆలయ రోడ్డులో మంగళవారం ప్రారంభించింది. కార్యక్రమంలో నీరుస్ ఎండీ అవినీష్‌కుమార్, హెడ్ డిజైనర్ ప్రియాకుమార్, సుచితా అహూజా, ఎఫ్ఐసిసిఐ ఎఫ్ఎల్ఓ విజయవాడ చైర్‌పర్సన్ అమృతకుమార్, వైస్‌చైర్‌పర్సన్ రజినీచిత్ర ప్రముఖ సామాజికవేత్త గంటా శారద అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం నీరుస్ ఎండీ అవినీష్‌కుమార్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వస్త్రాల వారసత్వాన్ని కాపాడుతూనే, నేటి తరం అభిరుచులకు అనుగుణంగా ఆధునికతను జోడించడంలో నీరుస్ ఎప్పుడూ ముందుంటుందని కొనియాడారు.

స్టోర్ ప్రారంభంలో అతిథులు, నిర్వాహకులు

ఈ స్టోర్‌లో సంప్రదాయ వస్త్రధారణను సమకాలీన శైలిలో ప్రదర్శించారు.. ముఖ్యంగా 'సిగ్నేచర్ డ్రేప్స్' (చీర కట్టే విభిన్న శైలులు) ప్రదర్శన అతిథుల దృష్టిని ఆకర్షించింది.

వ్యాపార విస్తరణలో శ్రీ జగదాంబ పెరల్స్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ముత్యాల ఆభరణాల రంగంలో వందేళ్ల చరిత్ర కలిగిన ప్రముఖ సంస్థ 'శ్రీ జగదాంబ పెరల్స్ తన వ్యాపారాన్ని మరింత విస్తరిస్తూ విశాఖపట్నంలో కొత్త స్టోర్‌ను మంగళవారం ప్రారంభించింది. సంస్థ మేనేజింగ్ పార్టనర్ అవనీష్ అగర్వాల్ మాట్లాడుతూ ప్రస్తుతం వినియోగదారులు ఆభరణాల విషయంలో స్వచ్ఛత, సర్టిఫికేషన్ ఆధునిక డిజైన్ల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. విశాఖ ప్రజలకు నమ్మకమైన సేవలను అందించడమే తమ లక్ష్యమన్నారు.

విఎంఆర్‌డిఎ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: వీఎంఆర్‌డీఎ చిల్డ్రన్స్ ఏరీనాలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి కనబరిచినందుకు మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం చిల్డ్రన్స్ ఏరీనా ప్రాంగణంలో ఎటువంటి రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడం పూర్తిగా నిషిద్ధం. అయితే, ఇటీవల అక్కడ ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన బ్యానర్లు వెలిసినప్పటికీ, స్థానిక పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న కిరణ్‌కుమార్ వాటిని అడ్డుకోవడంలో విఫలమయ్యారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఎటువంటి ముందస్తు సమాచారం అందించకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
A.S. No. of 2025
GR No. 13287 dated 23.07.2025
I.A. No. 2098 of 2025
AGAINST THE JUDGMENT IN O.S. No. 94 of 2020 DATED 24.04.2025
BETWEEN:
Sri Bandaru Sivakasubabu ... Appellant
AND:
Smt Basava Venkata Anasuya ...Respondent
To
Smt Basava Venkata Anasuya, W/o Late Krishna Rao, Hindu, aged 56 years, R/at D.No.2-157/29/30, Midilapuri Colony, Vikalangula Colony, Madhurawada, Visakhapatnam – 530048.
PUBLIC NOTICE
Please take notice that the Honourable Principal District Judge, Visakhapatnam, has directed you in the above unnumbered A.S. (arising out of O.S. No. 94 of 2020 dated 24.04.2025). You may appear in person or through an Advocate before the Honourable Principal District Judge, Visakhapatnam on the said date i.e. **06.01.2026,** failing which the above matter will be decided by the Hon'ble Court in your absence.
Jada Sravan Kumar
Advocate for plaintiffs,
Flat No. 502, GVK Plaza,
Seethampeta,
Visakhapatnam

IN THE HONOURABLE COURT OF THE 2nd ADDL. DISTRICT JUDGE AT VISAKHAPATNAM
(In the Matter of custody of minor child Soppa Mokshitha, daughter of S.Appala Suri Demudu @ Appala Raju, Saged 06 years)
GO.P. No. 18 / 2025
Between :
Soppa Appala Suri Demudu @ Appala Raju ...Petitioner
And :
Soppa (Kolli) Janaki ...Respondent
జనరల్ నోటీసు
ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయడం ఏమనగా శ్రీ సొప్పా అప్పల సూరి దేముడు ఏ అప్పలరాజు శ్రీ విశాఖపట్నం రెండవ అదనపు జిల్లా కోర్టులో గార్డియన్ పిటిషన్ GOP 18/2025 శ్రీమతి సొప్పా (కొల్లి) జానకిగారిపై వారికి పుట్టిన మైనరు ఆడపిల్ల చి॥ మోక్షితకు గార్డియన్‌గా నియమించమని పిటీషన్ వేసియున్నారు. ఆ కేసు GOP 18/2025 తేది: 30-01-2026 వాయిదా యున్నది. కావున పై పేర్కొన్న పిటిషన్లో ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఆక్షేపణలు యున్నయెడల మీరు వ్యక్తిగతంగా గాని, వకీలుద్వారా గాని **తేది: 30-01-2026న ఉదయం 10గం॥ 30ని॥** కోర్టుకు సమర్పించగలరు. అలా ఎటువంటి అభ్యంతరములు తెలియజేయని యెడల మీకు ఎటువంటి అభ్యంతరములు లేవని శ్రీకోర్టు పరోక్షములో శ్రీ కోర్టు వారు తీర్పు చెప్పెదరు అని ఇందు మూలంగా బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమయినది.
B.GANESH BABU
Advocate for Petitioner,
Visakhapatnam.
Visakhapatnam Dt. 23-12-2025
Cell : 9440119591, 8790809591

మహారాజశ్రీ ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో.
E.A73/2024 IN E.P34/2018
IN O.S 2/2017
బిట్వీన్
తోట పెద్ద వెంకటేశ్వరరావు ... DHr.
అండ్
తోట శ్రీరామమూర్తి వగైరాలు .... JDRs.
నోటీస్
టు,
2. తోట ప్రకాశమ్మ భర్త లేటు శ్రీరామ్ మూర్తి, గృహిణి, వయసు 70 సంవత్సరములు, డోర్ నెంబర్ 9-68, గుంటపల్లి, పాయకరావుపేట.
3. తేటకాయల సత్యకుమారి భర్త గంగాధర్, వయసు 49 సంవత్సరములు, అలకానంద కాలనీ MIG-55, ఈశ్వర భవాని, ప్లాట్ నెంబర్ -102, SBI ట్రైనింగ్ సెంటర్ దగ్గర, విజయనగరం.
4. తుమ్మల జానకి భర్త రామస్వామి అలియాస్ రామ్, వయసు 46 సంవత్సరములు, విజయవాడ.
5.అన్నందేవర సత్యవతి అలియాస్ చిట్టి. భర్త కృష్ణ, వయసు 43 సంవత్సరములు, శ్రీరామ విద్యానికేతన్, పట్టాభిరామయ్య నగర్, గొల్లప్రోలు, కాకినాడ జిల్లా.
6. పరవత గంగ లక్ష్మి అలియాస్ బుజ్జి, భర్త వెంకట రామకృష్ణ, వయసు 42 సంవత్సరములు, శంఖవరం గ్రామం అండ్ మండలం, కాకినాడ జిల్లా.
7.తోటకూర సత్య కళ భర్త సత్య అమర్నాథ్, వయసు 40 సంవత్సరములు, పెద బ్రహ్మ దేవం, కాకినాడ జిల్లా.
పై నెంబర్ ఈ.పి లో తోట శ్రీరామమూర్తి చనిపోయిన కారణంగా ఆయనకు వారసులుగా చేర్పించమని కోరుచూ పై పిటిషన్ దాఖలు చేయగా, సదర్ పిటిషన్ యందు పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 9-1-2026 వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయర్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల అభ్యంతరములను తెలుపుకొనవలెను, లేనిచో మీ పరోక్షమందు పై పిటిషన్ తీర్మానించబ డును.
A.V.S. భవాని ప్రసాద్.
అడ్వకేట్, అనకాపల్లి.

గోమాంసం ఖననంపై గ్రామస్తుల ఆగ్రహం

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం కుసులవాడ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ గోమాంసం ఖననంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే నెంబరు 247 పరిధిలోని శ్రీ మిత్ర కోల్డ్ స్టోర్‌లో నిల్వ చేసిన అక్రమ గోమాంసాన్ని కుసులవాడ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 247 ప్రాంతంలో ఖననం చేయడాన్ని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కోల్డ్ స్టోర్‌లోని అక్రమ గోమాంసాన్ని తమ గ్రామ పరిధిలో ఖననం చేయడం ఏమిటని అధికారులను నిలదీశారు. గతంలో సర్వే నెంబరు 104లోని ఎద్దు మెట్ట ప్రాంతంలో సుమారు 7 హెక్టార్లు భూమిని మైనింగ్ పేరుతో ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని, ఇచ్ఛాపురం సర్వే నెంబరు 37లో మైనింగ్ పేరుతో సర్వేలు నిర్వహించిన ఘటనలను వారు గుర్తు చేశారు. ఇదే పంచాయతీలో గతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసేందుకు పరిశీలన కూడా చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కుసులవాడ గ్రామపంచాయతీని మైనింగ్, డంపింగ్ కేంద్రంగా మార్చి ప్రజలను ఇబ్బంది పెట్టడం తప్ప అభివృద్ధి పనులు చేపట్టడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామానికి చెందిన శినగం దాము సహా పలువురు గ్రామస్తులు ప్రశ్నించారు. గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 4,500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు చేపట్టడం లేదని తెలిపారు.

పోలీసులను నిలదీస్తున్న కుసులవాడ గ్రామస్తులు షినగం దాము తదితరులు

భవిష్యత్తులో మైనింగ్, డంపింగ్ వంటి పనులు చేపడితే తీవ్రంగా ప్రతిఘటిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ సందర్భంగా సంఘటనా స్థలానికి ఎస్‌ఐలు పందిరి శివ, సంతోష్ తదితరులు చేరుకుని ఖననంపై కోర్టు నోటీసులను గ్రామస్తులకు చూపించారు. గో మాంసాన్ని ఖననం చేసే గొయ్యి లోతు పెంచి సరైన జాగ్రత్తలు తీసుకొని పూడ్చుతామని అధికారులు తెలియజేశారు. గోమాంసం ఖననం వల్ల పరిసర ప్రాంత ప్రజలకు, పశువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను వారు కోరారు.

నేరాలు ఘోరాలు

గాయాల పాలైన వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- రావికమతం: చలిమంట కాగుతూ చీరకు నిప్పంటుకోవడంతో అగ్నిప్రమాదానికి గురై గాయాల పాలైన వృద్ధురాలు మృతి చెందింది. వివరాలివి. మండలంలో మేడివాడ పంచాయతీ శివారు అప్పలమ్మపాలెం గ్రామానికి చెందిన పాచిలి చిలకమ్మ (60)సోమవారం చలికి మంట కాగుతూ చీరకు నిప్పు అంటుకొని శరీరం మొత్తం కాలిపోయింది. వెంటనే రావికమతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేయగా, అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డు పరిధి చిలకావారి వీధిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడిచేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12.150 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- పద్మనాభం : పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణమ్మ సూచించారు. మండలంలోని ఆర్‌వి.పురం జిల్లా పరిషత్ హైస్కూలును మంగళవారం అన్నపూర్ణమ్మ సందర్శించారు. పాఠశాలల్లో వంద రోజులు యాక్షన్ ప్లాన్ విధానం నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. పలు అంశాలపై ప్రశ్నించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యక్ష సమావేశం ఏర్పాటు చేసి వందరోజు యాక్షన్ ప్లాన్‌పై ఉపాధ్యాయులతో చర్చించారు. యాక్షన్ ప్లాన్ రికార్డులు నిర్వహణ, విద్యార్థుల మార్కులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకరరావు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల్లో ఆనందపురం ఉపాధ్యాయుల జట్టు విజయం

ప్రజాశక్తి -ఆనందపురం : జిల్లా స్థాయి త్రో బాల్ పోటీల్లో ఆనందపురం మండలం ఉపాధ్యాయుల జట్టు ఘన విజయం సాధించింది. ఈ పోటీల్లో ఆనందపురం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం నుంచి కెటిఎస్.ప్రసాదిని, పి.ఎస్తేరు రాణి జట్టులో పాల్గొన్నారు. వారి ప్రతిభను గట్టంనేని సుభాష్ చంద్రబోస్ , శివాజీ, అప్పన్న, బంగారు రాజు, దేవుడుబాబు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగమణి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చిట్టివలసలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి మాట్లాడుతూ, వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై విద్యార్థులలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. నేటి మార్కెట్ వ్యవస్థలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. కామర్స్ విభాగ అధ్యాపకులు ఎ.విజయలక్ష్మి వినియోగదారుల హక్కులను గురించి వివరించారు. ఎవరైనా నష్టం జరిగినట్లు భావిస్తే వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో సచివాలయం వద్ద ఆర్‌కె హాస్పిటల్ ఆధ్వర్యాన బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు కాళ్ల సత్యానంద్ తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతాంగం సుభిక్షంగా ఉండాలి

ఎపి కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ సందీప్

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవితేజ, సందీప్

ప్రజాశక్తి -భీమునిపట్నం : రైతాంగం ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని ఎపి కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ డాక్టర్ పంచకర్ల సందీప్ ఆకాక్షించారు. మండలంలోని రేఖవానిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం బ్లూమింగ్ స్టార్స్ స్కూల్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సందీప్ మాట్లాడుతూ, అన్నం ఎలా తయారవుతుందో, ధాన్యం పంట ఎలా పండిస్తారో ఇప్పుడున్న పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను రైతాంగం అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి యువ నేత గంటా రవి తేజ మాట్లాడుతూ, రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు మాట్లాడుతూ, వ్యవసాయరంగం మరింత అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. సర్పంచ్ ఎస్.శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జివిఎంసి 3వ వార్డు టిడిపి అధ్యక్షులు గొలగాని నరేంద్ర కుమార్, నాయకులు వై.అనిల్‌ప్రసాద్, స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత గంటా రవితేజ, సందీప్‌జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చంద్రంపాలెం ఆట స్థలంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

చంద్రంపాలెం ఆట స్థలం పనుల పరిశీలన

ప్రజాశక్తి-మధురవాడ : చంద్రంపాలెం హైస్కూల్ ఆట స్థలం పనులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. వర్షం పడితే మైదానంలో నీరు నిలిచిపోతుండటంతో ఆ సమస్య పరిష్కరించేందుకు దివీస్ సిఎస్‌ఆర్ నిధులు రూ. కోటి కేటాయించేలా ఆ సంస్థను గంటా శ్రీనివాసరావు ఒప్పించి ఆట స్థలాన్ని ఆధునీకరించడానికి శ్రీకారం చుట్టారు. ఆ పనుల ప్రగతిని పరిశీలించి, నీరు నిలిచిపోకుండా అవసరమైన డిజైన్ రూపకల్పన చేయాలని సూచించారు. హైస్కూల్‌లో అదనపు సౌకర్యాలు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ వెంకటరావు, జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, గరే గురునాథ్, మన్యాల సోంబాబు, కె.అచ్యుతరావు, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వార్డులో కార్పొరేటర్ సునీత పర్యటన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు దీనదయాల్‌పురంలో కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ మంగళవారం పర్యటించారు. గ్రామ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, జివిఎంసి అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. సిసి రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను ఆమెకు స్థానికులు వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కెల్ల సునీతసత్యనారాయణ మాట్లాడుతూ, స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జివిఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ పర్యటనలో టిడిపి వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, సంఘం అధ్యక్షులు యల్లమిల్లి సురేష్, తెలుగు యువత అధ్యక్షులు వడిసెల శ్రీను, బిసి సెల్ అధ్యక్షులు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వార్డులో పరిశీలిస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ

జూ పార్కులో నెమళ్ల ఎన్‌క్లోజర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో నూతనంగా అభివృద్ధి చేసిన నెమళ్ల ఎన్‌క్లోజర్‌ను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ పివి.చలపతిరావు, అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ శాంతి ప్రియ పాండే, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బిఎం.దివాన్‌తో, జూ క్యూరేటర్ జి.మంగమ్మ మంగళవారం ప్రారంభించారు. పుట్టిన చిన్న పిల్లలతో సహా మొత్తం 40 నెమళ్లకు ఈ ఎన్‌క్లోజర్‌లో నివాసం కల్పించినట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఇది నెమళ్ల సంక్షేమం, సంరక్షణకు సరిపడే వాతావరణాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా జంతు దత్తత కార్యక్రమంలో భాగంగా ఇషాన్వి, మనస్విలు 15 నెమళ్లను దత్తత తీసుకున్నారు.

కళ్లివానిపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ

గ్రామస్తుల ఫిర్యాదులతో రెవెన్యూ శాఖ చర్యలు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కళ్లివానిపాలెం గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్ 237 పరిధిలోని ప్రభుత్వ స్థలంలో ఉప్పాడ రామారావు అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం, సదరు వ్యక్తి గతంలో ఇదే ప్రభుత్వ భూమిలో సుమారు 120 గజాల విస్తీర్ణంలో రెండు ఇళ్లను నిర్మించి ఇతరులకు విక్రయించినట్లు తెలిపారు. అనంతరం మరో మూడు ఇళ్లను 60 గజాల చొప్పున అక్రమంగా నిర్మించాడని, తాజాగా మరో 100 గజాల స్థలంలో మళ్లీ ఇళ్లు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నాడని గ్రామస్తులు పేర్కొన్నారు. దీనిపై విఆర్‌ఒకు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ ఆదేశాల మేరకు అక్రమంగా నిర్మించిన గోడను రెవెన్యూ అధికారులు జెసిబితో తొలగించినప్పటికీ సదరు వ్యక్తి నిర్మాణ ప్రయత్నాలను కొనసాగిస్తుండటంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు వెల్లడించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు మళ్లీ గ్రామానికి చేరుకుని అక్రమంగా నిర్మించిన సెప్టిక్ ట్యాంక్‌తో పాటు అరటి మొక్కలను తొలగించినట్లు గ్రామస్తులు తెలిపారు. అయినా అక్రమ నిర్మాణ ప్రయత్నాలు ఆగకపోవడంతో తక్షణమే రెవెన్యూ శాఖ హెచ్చరిక నోటీస్ బోర్డు ఏర్పాటుచేసి అక్రమ ఆక్రమణలను పూర్తిగా అడ్డుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడే ఈ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణల నుంచి రక్షించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గోస్తనీ స్కూల్లో వాజ్‌పేయి శత జయంతి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని గోస్తనీ విద్యాపీట్ హైస్కూల్లో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహార్ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి స్థానిక తహశీల్దార్ కాకర ఆనందరావు ముఖ్య ముఖ్యఅతిథిగా హాజరై వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 350 విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పండ్లు, బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్య పట్ల అంకిత భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రూపాకుల ట్రస్ట్ చైర్మన్ రూపాకుల రవికుమార్, స్థానికులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, తమటపు నాగమణి, ఉప్పాడ అప్పారావు, పాలూరి కృష్ణారావు, మచ్చ సోమేష్, సిరపు వెంకట్రావు, కలగర్ల పేర్రాజు పాల్గొన్నారు.

హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టర్లను నిలదీస్తున్న యూనియన్ నాయకులు

స్థానికులకు ఉపాధి కల్పించాలి

- కాంట్రాక్టర్లను నిలదీసిన యూనియన్ నాయకులు

ప్రజాశక్తి -ములగాడ : హెచ్‌పిసిఎల్‌లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ సంస్థ గేటు వద్ద కాంట్రాక్టర్లను స్థానిక యూనియన్ నాయకులు నిలదీశారు. మల్కాపురం భూముల్లో హెచ్‌పిసిఎల్‌ను నిర్మించారని, అందుకుగాను కాంట్రాక్టు పనుల్లోనూ, కాంట్రాక్టు పనులను మల్కాపురం ప్రాంత వాసులకు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కాంట్రాక్టర్లు మల్కాపురం పోలీసులను ఆశ్రయించారు. మల్కాపురం పోలీసులు వచ్చి ఇరు వర్గాలపై కేసులు పెడతామని హెచ్చరించారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గణబాబు

సచివాలయ సిబ్బందితో గణబాబు ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 90, 91 వార్డుల సచివాలయ సిబ్బంది, కేడర్‌తో ప్రభుత్వ విప్ గణబాబు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయ సిబ్బంది పారదర్శకంగా పనిచేస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు కచ్చితంగా అందేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. శానిటేషన్, నీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మౌర్యసింహ, జోనల్ కమిషనర్లు రాము, శంకరరావు, కార్పొరేటర్ బొమ్మిడి రమణ, నీటి సరఫరా డిఇ వీరయ్య, కూటమి నేతలు నారిపిన్ని సత్తిరాజు, శరగడం అరుణ్ కుమార్, బంగారు తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్‌లో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

స్టీల్‌ప్లాంట్‌లో మాక్ డ్రిల్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో మంగళవారం వార్షిక ఎల్‌పిజి లీకేజ్ అత్యవసర మాక్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఎల్‌పిజి ఇన్‌స్టాలేషన్-1 వద్ద భారీ లీకేజ్ జరిగి నలుగురు కార్మికులు చిక్కుకున్నట్లు భావించి అత్యవసర సైరన్ మోగించగా, ప్రభావిత ప్రాంతాన్ని ఖాళీ చేసి స్ప్రింక్లర్ వ్యవస్థ, ఆసిలేటింగ్ మానిటర్లతో గ్యాస్ వ్యాప్తిని నియంత్రించారు. సిఐఎస్ఎఫ్ ఫైర్ వింగ్, ఎన్‌డిఆర్ఎఫ్, గ్యాస్ సేఫ్టీ విభాగం, ఏపి ఫైర్ సర్వీసులు, ఎన్‌టిపిసి సింహాద్రి ఫైర్ వింగ్ పాల్గొని సహాయక చర్యలు చేపట్టాయి. ఒకరిని ఆసుపత్రికి తరలించగా, మిగిలిన ముగ్గురిని సురక్షితంగా రక్షించారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిన అనంతరం 'ఆల్ క్లియర్' సైరన్ మోగించారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో స్పందన సామర్థ్యాన్ని పరీక్షించామని అధికారులు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న తోట త్రిమూర్తులు

ప్రజాశక్తి- పేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామిని ఏపిఎల్ఎ కమిటీ చైర్మన్ తోట త్రిమూర్తులు మంగళవారం దర్శించుకున్నారు. తోట త్రిమూర్తులుకు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి, ఇతర సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. స్వామిని దర్శించుకున్నారు.

సాంకేతిక ప్రగతితో నూతన అవకాశాలు

ప్రజాశక్తి-మధురవాడ : సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అర్థం చేసుకుని తదనుగుణంగా యువత తమ కెరీర్‌ను మలచుకుంటే నూతన అవకాశాలను చేజిక్కించుకోవచ్చని ప్రముఖ ఐటి సంస్థ కాగ్నిజెంట్ మాజీ సిఎమ్‌డి రామ్‌కుమార్ రామమూర్తి పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన ఛేంజ్ మేకర్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కృత్రిమ మేధ, డేటా సైన్స్ వంటివి ప్రస్తుత డిజిటల్ యుగంలో కొత్త ఐటి ఆధారిత సంస్థల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూనే, నైపుణ్యం గల యువతకు విస్తృత కెరీర్ మార్గాలను సృష్టిస్తున్నాయని తెలిపారు. ప్రపంచంలో 20 శాతం నూతన టెక్నాలజీల ఆవిర్భావానికి భారతదేశం కేంద్రంగా మారిందన్నారు. వేగంగా మారుతున్న ప్రస్తుత డిజిటల్ టెక్నాలజీలను అర్థం చేసుకుంటూ యువతరం అవకాశాలను అందుకోవాలని పిలుపునిచ్చారు. గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ ప్రభావం అన్ని రంగాలపైన ఉందని, యువత తాము ఎంచుకున్న కోర్సులతో పాటు ఇతర శాస్త్రాలలో వస్తున్న మార్పులను అర్థం చేసుకుంటూ ఎదగాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథిని గీతం విసి ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా సన్మానించారు. కార్యక్రమంలో గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు, గీతం టెక్నాలజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామ్‌కుమార్ రామమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న గీతం ప్రతినిధులు

విశాఖ పాలిటెక్నిక్‌లో ప్రాజెక్ట్ ఎక్స్‌పో

ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-వేపగుంట : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో విఐఇటి ఉత్సవ్-25 పేరిట సంబరాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ఏర్పాటు చేసిన 'ప్రాజెక్ట్ ఎక్స్‌పో' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎన్ఎస్‌టిఎల్ శాస్త్రవేత్త ఎఫ్ఎస్.మధు కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రాజెక్ట్ ఎక్స్‌పోను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్ట్ నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకుని ఉత్తమ ఇంజినీర్లుగా ఎదగాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించడానికి కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమన్నారు. ఈ ఎక్స్‌పోలో కళాశాల విద్యార్థులు తయారుచేసిన సుమారు 50 ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శించారు. వీటిని తిలకించేందుకు నరవ, కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం, ప్రహ్లాదపురం, సింహాచలం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ హైస్కూళ్లకు చెందిన సుమారు 500 మంది పదో తరగతి విద్యార్థులు తరలివచ్చారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రాజెక్టులకు, అకడమిక్ టాపర్లకు అతిథుల ద్వారా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.ప్రదీప్‌వర్మ, పాలిటెక్నికల్ ప్రిన్సిపల్ పి.ప్రసాద్, ఎఒ పి.సుబ్బరాజు, ఒఎస్‌డి గాయత్రి రామ్ పాల్గొన్నారు.

టిడిఆర్ జిఒ అమలు జాప్యంపై గంటా ఆగ్రహం

ప్రజాశక్తి-మధురవాడ : బిఆర్‌టిఎస్ రోడ్డు టిడిఆర్‌లకు సేల్ ఆప్షన్ ఇవ్వాలని ప్రభుత్వం జిఒ జారీ చేసినా జివిఎంసి అధికారులు అమలు చేయకపోవడంపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యతిరేక వార్త వచ్చిందని ప్రభుత్వ ఉత్తర్వుల అమలును ఎలా నిలిపేస్తారని టౌన్ ప్లానింగ్ డిసిపి హరిదాసును ప్రశ్నించారు. ఒకవేళ వ్యతిరేక వార్త వస్తే మాస్టర్ ప్లాన్ రోడ్డు కూడా ఆపేస్తారా అని నిలదీశారు. మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, దేవాదాయ శాఖ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ వంటి ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్న కమిటీ ఇచ్చిన ఆదేశాలు అమలులో జాప్యం ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. లావాదేవీలు జరగకుండా టిడిఆర్‌లను హోల్డ్‌లో పెట్టడం వల్ల ఇబ్బందులు పడుతున్న బాధితులు మంగళవారం పాత అడవివరం జంక్షన్ వద్ద గంటాను కలిసి సమస్యను వివరించారు. సింహాచలం టిడిఆర్‌ల అంశాన్ని ప్రత్యేక కేసుగా పరిగణిస్తూ ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చిన గంటాకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సన్మానించారు. ఉత్తర్వులిచ్చి 10 రోజులు దాటుతున్నా అమలు చేయకుండా జాప్యం చేయడం పట్ల స్థానిక కార్పొరేటర్ పివి.నరసింహం నిరసన వ్యక్తం చేస్తూ గంటాకు ఫిర్యాదు చేశారు.

పలుచోట్ల సిపిఐ శత వార్షికోత్సవం

ప్రజాశక్తి- యంత్రాంగం

సిపిఐ శత వార్షికోత్సవాన్ని పలుచోట్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ములగాడ : మల్కాపురం గ్రామ మండలి కార్యాలయం వద్ద సిపిఐ పతాకాన్ని కాంగ్రెస్ సత్యాంజనేయ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26వ తేదీన విశాఖలోని సరస్వతి పార్కు నుంచి గాంధీ విగ్రహం వరకు ప్రదర్శనలో పారిశ్రామిక ప్రాంతంలోని సిపిఐ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గుడాల రాంబాబు, కె.శ్రీనివాసరావు, ఎన్‌వి.త్రినాథ్, డి.గోపి, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి శివశక్తినగర్‌లో సిపిఐ పతకాన్ని పార్టీ సీనియర్ సభ్యుడు బి.కేశవయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ, శుక్రవారం విశాఖ సరస్వతీ పార్కు నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు నిర్వహించే శత వార్షికోత్సవాల ప్రజా ప్రదర్శన జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎమ్‌డి బేగం, జెడి.నాయుడు, వి.సత్యనారాయణ, బి.కేశవయ్య, ఎస్‌కె.సల్మా, పి.రమణ, ఎంఎస్.పాత్రుడు, పి.అన్నాజీ పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవ సిపిఐ శాఖ ఆధ్వర్యంలో ఆరిలోవ పాత పోలీస్‌స్టేషన్ వద్ద పార్టీ జెండాను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల ఎగురవేశారు. ఈ సందర్భంగా అత్తిలి విమల, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహ్మాన్ మాట్లాడుతూ, సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని తలపెట్టే శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అప్పికొండ, దేవుడమ్మ, కాసుబాబు, కొమరం సందీప్, లక్ష్మణరావు, పుష్ప, అత్తిలి రవి, చిరంజీవి పాల్గొన్నారు.

పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు

ప్రజాశక్తి -కరాస: ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి ఓల్డ్ కరాస పెట్రోల్ బంకు వద్ద అవుట్ పోస్టును వెస్ట్ ఏసిపి పృథ్వీతేజ, సిఐ వి.శంకరనారాయణ, స్థానికులతో కలిసి లా అండ్ ఆర్డర్ డిసిపి మేరీ ప్రశాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేరీ ప్రశాంతి మాట్లాడుతూ, శాంతి భద్రతలను రక్షించి పోలీసు శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడానికి ఈ అవుట్ పోస్టును ఏర్పాటు చేశామని చెప్పారు. ఏసిపి పృథ్వీతేజ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నియంత్రించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అవుట్‌పోస్ట్‌లో నలుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 52వ వార్డు టిడిపి అధ్యక్షుడు వై.తిరుమలరావు, విశాఖ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ వెంకుమహంతి చంద్రశేఖర్, నాయకులు మందలపు వాసుదేవరావు, పూసపాటి బలభద్ర రాజు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ వీర్రాజుకు డిజిపి కమెండేషన్ డిస్క్ అవార్డు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు ప్రతిష్ఠాత్మక డిజిపి కమెండేషన్ డిస్క్ అవార్డుకు గోపాలపట్నం పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బోనేల వీర్రాజు ఎంపికైనట్లు ఇన్‌స్పెక్టర్ లంక సన్యాసినాయుడు తెలిపారు. పోలీసు శాఖలో వివిధ విభాగాల్లో అందించే ఈ అవార్డులను 2025 సంవత్సరానికిగాను రాష్ట్ర డిజిపి ప్రకటించినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తుల్లో ప్రతిభ కనబర్చినందుకు వీర్రాజుకు ఈ అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బోనేల వీర్రాజును ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, ఎస్ఐ రామారావు, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

పోక్సో చట్టంపై శిక్షణ

ప్రజాశక్తి-ఆనందపురం : వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో విప్రో కేర్ ఫౌండేషన్ మద్దతుతో ఆనందపురం మండల కార్యాలయంలో పిల్లలపై లైంగిక నేరాల నుండి రక్షణ (పోక్సో) చట్టంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఏర్పాటుచేసిన ఈ శిక్షణలో న్యాయవాది ప్రసాద్ చట్టంలోని ముఖ్య నిబంధనలు, కేసుల నమోదు విధానం, బాధిత పిల్లలకు అందాల్సిన చట్టపరమైన రక్షణ చర్యలను వివరించారు. సిహెచ్‌ఒ జి.శ్రీనివాసరావు పిల్లల మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు, కుటుంబం, సమాజం సమిష్టిగా పిల్లలకు సురక్షిత వాతావరణం కల్పించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ మాధవి గణపతి, కో-ఆర్డినేటర్లు వరలక్ష్మి, రమణి, సూపర్‌వైజర్ నాగరాజు, యానిమేటర్ భవాని, పిసి వరలక్ష్మి పాల్గొన్నారు.

పందుల స్వైర విహారం

- అరటి తోటలు ధ్వంసం

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ పరిధి కల్లివానిపాలెం గ్రామంలో పందులు స్వైర విహారం చేసి అరటి తోటలు, ఆకుకూరలు, కాయగూర, మిరప తోటలను ధ్వంసం చేశాయి. వాంబే కాలనీ పరిసర ప్రాంతాల నుండి పందులను విచ్చలవిడిగా విడిచిపెట్టడంతో అవి గ్రామాల్లో చొరబడి పంట పొలాలను నాశనం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామానికి చెందిన దక్కత శ్రీనివాస్‌కు సుమారు 100 అరటి మొక్కలు, ఆకుకూరలు, కాయగూర తోటలు పందుల వల్ల ధ్వంసం అయ్యాయని తెలిపారు. గండిబోయిన ఆదమ్మ, గండిబోయిన రమణ, ఉప్పాడ అప్పలరెడ్డి తదితరుల పంటలను ధ్వంసం చేస్తున్నాయన్నారు. పంచాయతీ అధికారులు పందుల సమస్యను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'ఉపాధి హామీ'ని యథాతథంగా కొనసాగించాలి

27న చలో రాజ్ భవన్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విబి-జిఆర్ఎఎం జి పేరుతో తెచ్చిన సవరణ బిల్లును రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 27న చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, అధ్యక్షులు యం.సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె భవాని పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పేదల వలసలను అరికట్టి వారి ఆత్మ స్థైర్యాన్ని, ఆర్థిక స్వాలంబనను పెంచిన ఈ ఎంజిఎన్ఆర్ఇజిఎను కేంద్ర ఎన్‌డిఎ ప్రభుత్వం రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ చట్టంలో గుండె కాయ లాంటి పని హక్కును కాలరాసి మొండెం లేని తలకాయ లాగా జిఆర్ఎఎం జీ పేరుతో సవరణ చేయడం ద్వారా కోట్లాది మంది పేదలకు తీవ్రమైన ద్రోహం చేసిందని పేర్కొన్నారు. ఈ సవరణకు మన రాష్ట్రంలోని టిడిపి, జనసేనతో పాటు ప్రతిపక్ష వైసిపి కూడా ఓట్లు వేసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశాయని మండిపడ్డారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించి గాంధీని చంపిన నాథూరామ్ గాడ్సే పేరు వచ్చేలా మార్చడం దారుణమన్నారు. ఈ చట్టాన్ని మరింత బలోపేతం చేసి అమలు చేయాలని, సవరణ బిల్లును రద్దు చేయాలని కోరుతూ ఈనెల 27న విజయవాడలో ఉన్న రాష్ట్ర గవర్నర్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న

కూలీల నిరసన

బుచ్చయ్యపేట : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విబి-జిఆర్ఎఎం జి పథకాన్ని రద్దు చేసి 2005 నాటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ మండలంలోని రాజాం, నీలకంఠపురం గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద కూలీలు మంగళవారం రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం సభ్యులు వడ్డాది నాయుడు, ఎం సత్యనారాయణ, పడాల అప్పారావు, పడాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

మెడల్స్ చూపుతున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : ఆంధ్రప్రదేశ్ వాడికాయ్ కరాటే అసోసియేషన్ వారు గాజువాకలో నిర్వహించిన 14వ ఏపీ స్టేట్ కరాటే టోర్నమెంట్‌లో యలమంచిలి విద్యార్థులు ప్రతిభ చూపారు. స్థానిక పిఎన్ఆర్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ నక్కా వెంకట్రామన్ శిష్య బృందం విద్యార్థులు ఇందులో పాల్గొని 3 బంగారు, 5 వెండి, 5 బ్రాంజ్ పతకాలు సాధించారు. 10 సంవత్సరాలు బాలుర ఫైటింగ్ విభాగంలో ఎస్.లీలా లోహిత్, 13 సంవత్సరాల విభాగంలో ఎస్‌కె అఫ్రీన్ కాట, 10 సంవత్సరాలు బాలికల విభాగంలో ఎస్‌కె అయేషభాను బంగారు పతకాలు సాధించారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు శ్వేత

ప్రజాశక్తి-పాయకరావుపేట : స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థిని తుంపాల శ్వేత జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి తెలిపారు. శ్వేత ఎన్‌సిసి మూడవ ఆంధ్రా బాలికల బెటాలియన్ నుండి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఎనిమిది క్యాంపుల్లో ఎంపికై చివరగా ఈ నెల 29 నుండి జనవరి 20 వరకు జరిగే రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపులో శిక్షణ తీసుకొని జనవరి 26న ఢిల్లీలో జరిగే పరేడ్‌లో పాల్గొంటుందని తెలిపారు. ఇంతటి ప్రతిష్టాత్మక క్యాంపునకు ఎంపికైన శ్వేతను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

తుంపాల శ్వేత



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న ఎన్‌టిపిసి సింహాద్రి ప్రతినిధులు

ఎన్‌టిపిసి సింహాద్రి సిఎస్ఆర్ నిధులు చెక్కు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్టిపిసి సింహాద్రి తన సిఎస్ఆర్-సిడి చొరవ కింద మంజూరు చేసిన 1,21,50,000 రూపాయల్లో రూ.50 లక్షల చెక్కులను జిల్లా కలెక్టరు విజయకృష్ణన్‌కు మంగళవారం కలెక్టరేట్లో ఎన్టిపిసి ప్రతినిధులు అందజేశారు. అనకాపల్లి జిల్లాలోని 6 పిహెచ్‌సిలు, 3 యుపిహెచ్‌సిలను సమకూర్చుకోవడానికి, అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ యూనిట్‌కు, కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు రోడ్డు నిర్మాణం కోసం ఎన్టిపిసి సింహాద్రి తన సిఎస్ఆర్-సిడి చొరవ కింద రూ.1,21,50,000 ఆర్థిక సహాయం మంజూరు చేసింది. ఇప్పటికే రూ.72.50 లక్షల మొదటి విడత మొత్తాన్ని విడుదల చేశారు. పోలీస్ శాఖకు మద్దతుగా కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం కోసం ఎన్టిపిసి సింహాద్రి తన సిఎస్ఆర్-సిడి చొరవ కింద రూ.50 లక్షలను మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో ఎన్‌టిపిసి ప్రతినిధులు ఎజిఎమ్(హెచ్ ఆర్) బిబి.పాత్ర, సిఎస్ఆర్ సెక్షను ఉద్యోగులు కె.ప్రకాశరావు, శివం ప్రతాప్ సింగ్, డిజిఎం(ఎన్‌సి) పాల్గొన్నారు.

14 మందికి డిజిపి కమెండేషన్ డిస్క్-2025 అవార్డులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పోలీస్ శాఖలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వారి కమెండేషన్ డిస్క్-2025' అవార్డులు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన అంకితభావం, సమర్థతకు గుర్తింపుగా జిల్లాకు మొత్తం 14 అవార్డులు దక్కాయి. ఇందులో 3 సిల్వర్ డిస్క్, 11 బ్రాంజ్ డిస్క్ అవార్డులు ఉన్నాయి. డీజీపీ సిల్వర్ డిస్క్ అవార్డు గ్రహీతలుగా ఎల్.అప్పారావు (పిసి-సబ్బవరం), వై.నరసింహమూర్తి (పిసి-కేడీ.పేట), కె.రమణ (పిసి-మునగపాక), బ్రాంజ్ డిస్క్ అవార్డు గ్రహీతలుగా వై.తారకేశ్వరరావు (ఎస్ఐ-కేడీ.పేట), బి.సురేష్‌బాబు (ఎస్ఐ-ఐటీ కోర్, డిపిఓ), బి.అప్పారావు (ఏఎస్ఐ-కొత్తకోట), బి.శ్రీనివాసరావు (హెచ్‌సి-సబ్బవరం), ఎం.హేమంతకుమార్ (హెచ్‌సి-డీసిఆర్బి), ఎస్.వరాహబాబు (హెచ్‌సి-డీఎస్బీ), కె.చిరంజీవి (హెచ్‌సి-కేడీ.పేట), బి.సత్యనారాయణ (పిసి-పరవాడ), బి.గోవిందరావు (పిసి-ఐటీ కోర్), పిఎస్‌జి.పవన్ కుమార్ (పిసి-పీఆర్.పేట), ఎఎస్.కృష్ణమూర్తి (ఏఆర్‌పిసి-డీఏఆర్) ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అవార్డు గ్రహీతలను ప్రత్యేకంగా అభినందించారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించాలి

సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన రైతులకు, కష్టపడి పనిచేసిన కార్మికులకు వెంటనే బకాయిలు విడుదల చేయాలని, ఫ్యాక్టరీని ఆధునికీకరించాలని కోరుతూ అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎపి రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలియజేశారు. అనంతరం జిల్లా సుగర్ కేన్ అసిస్టెంట్ కమిషనర్ కె.లోకేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ 2024-25 సీజన్లో రైతులకు బకాయిలు, కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పండిన చెరుకును వేరే సుగర్ ఫ్యాక్టరీలకు తరలించడంతో ఇక్కడి రైతాంగం అధోగతి పాలయ్యారన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధినిస్తున్న ఫ్యాక్టరీని ఈ ఏడాది క్రషింగ్ నిర్వహించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలోనే సహకారంగంలో నడుస్తున్న ఏకైక గోవాడ సుగర్ ఫ్యాక్టరీని మూసివేత దిశగా తీసుకెళ్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం గోవాడ ఫ్యాక్టరీ రైతులకు, కార్మికులకు బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఫ్యాక్టరీ ఆధునికరణకై నిధులు కేటాయించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు, రైతు సంఘం నాయకులు గంట శ్రీరామ్, గండి నాయనబాబు, గూనూరు వరలక్ష్మి, నాగిరెడ్డి సత్యనారాయణ, ఎస్వీ నాయుడు, కాళ్ల తాలయ్యబాబు, పి మాణిక్యం, వెంకటలక్ష్మి, డి శ్రీనివాసరావు, డిడి వరలక్ష్మి, ఈ నరసింహమూర్తి, భవాని తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతు సంఘం, సిఐటియు నేతలు

నాలుగు పంచాయతీలుగా కింతాడ విభజన

ప్రజాశక్తి-కె.కోటపాడు : 11 గ్రామాల కలయికతో మండలంలోనే అత్యధిక విస్తీర్ణంగా ఉన్న కింతాడ పంచాయతీ నాలుగు పంచాయతీలుగా విభవించడానికి అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేసారు. మరో నాలుగు నెలల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. కింతాడ గ్రామసభ ముందుగానే గత జూన్ 13న ఏర్పాటు చేసి అన్ని గ్రామాల పెద్దలు అంగీకారంతో తీర్మానం చేశారు. శివారు గ్రామాలు ఉంటే పంచాయతీలుగా విడదీసుకోవాలని, ఇందుకు కావలసిన సహకారం అందిస్తానని గతంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. 3,503 ఓటర్లతో నాలుగు పోలింగ్ బూత్‌లుగా ఉన్న కింతాడ పంచాయతీని కింతాడ, బత్తివానిపాలెం, గొంపవానిపాలెం గ్రామాలు ఒక పంచాయతీగా, జోగన్నపాలెం, గంగాభవాని పాలెం మరో పంచాయతీగానూ, గొల్లలపాలెం, బొట్టవానిపాలెం కలపి ఒక పంచాయతీగానూ, రామచంద్రపురం, కూంద్రపువాని పాలెం, రావులమ్మపాలెం, మెరక రామచంద్రపురం గ్రామాలు నాలుగో పంచాయతీగా ఏర్పాటుకు ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే పింద్రంగి పంచాయతీలో ఉన్న దీక్షితులపాలెం గ్రామాన్ని దీక్షితుల అగ్రహారం గ్రామంలో కలపటానికి ఇరు గ్రామ పంచాయతీలు గ్రామసభల ద్వారా అంగీకారం తెలిపాయని అధికారులు చెప్పారు.

పివి.నరసింహారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : మాజీ ప్రధాన మంత్రి పివి.నరసింహారావు 21వ వర్ధంతి సందర్భంగా యలమంచిలి పీవీ కాంప్లెక్స్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం నుండి ప్రధాని పదవి చేపట్టిన పివి.నరసింహారావు ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొద్దపు శ్రీనివాసరావు, అరేపు గుప్తా, గాయత్రి సేవ ట్రస్ట్ గౌరవ చైర్మన్ సోమేశ్వరరావు, నక్క శివ శంకర్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో మౌలిక వసతులపై సదస్సు

ప్రజాశక్తి-చోడవరం : ఖరగపూర్ ఐఐటి అధ్యాపక బృందం సందర్శన నేపథ్యంలో పంచాయతీరాజ్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటి అధ్యాపకులు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్మాణం, క్లీన్ అండ్ గ్రీన్, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. పరిశీలించిన అంశాలపై నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని హేమ రైతు డిపో, గ్రోమోర్ షాప్, వెంకట నాగ చైతన్య రైతు డిపో తదితర దుకాణాల్లో చోడవరం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రవీంద్ర, మండల వ్యవసాయ అధికారి ఎల్‌వై.కాంతమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా నిల్వలను పరిశీలించారు. ఎరువుల దుకాణ యజమానులు రైతులకు తెలిసేలా షాప్ బయట ధరలు పట్టిక పెట్టాలని, రైతులకు బిల్ రశీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. వీరి వెంట వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణ సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : పరిశ్రమల పేరుతో బలవంతపు భూ సేకరణ సరికాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జెవి.సత్యనారాయణమూర్తి, ప్రొఫెసర్ శ్రీరామచంద్రయ్య పేర్కొన్నారు. సిపిఐ శతవార్షికోత్సవాల సందర్భంగా అనకాపల్లిలో పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణ అన్న అంశంపై మంగళవారం జిల్లా సదస్సు సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు అధ్యక్షతన గ్రంధి సత్యనారాయణ మెమోరియల్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఇప్పటివరకు పరిశ్రమల పేరుతో సేకరించిన భూములు పూర్తి వినియోగంలో లేవన్నారు. పోరాడి సాధించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించమని కోరలేని, మన రాష్ట్ర ఎంపీలు మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించాలని కోరడం సిగ్గుచేటన్నారు. ప్రొఫెసర్ శ్రీరామచంద్రయ్య మాట్లాడుతూ నక్కపల్లి మండలంలో నిర్మిస్తున్న బల్క్ డ్రగ్ పార్క్‌లో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలు అత్యంత ఎక్కువ కాలుష్యం వెదజల్లే పరిశ్రమలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదట భూములు, తర్వాత ఖనిజాలు, ఆ తర్వాత ప్రభుత్వ సంస్థలను పిపిపి పేరుతో కార్పొరేట్లకు ధారాదత్తం చేసే పనిలో నిమగ్నమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.విమల, బాలేపల్లి వెంకటరమణ, జిల్లా నాయకులు ఆర్.అప్పలరాజు, రావు జగ్గారావు, బి.పరమేశ్వరి, కె.రాధాకృష్ణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆచార్య శ్రీరామచంద్రయ్య

గ్యాస్ పైప్‌లైన్ సర్వే అడ్డగింత

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలం రావాడ రెవెన్యూ గ్రామ పరిధిలో గ్యాస్ పైప్‌లైన్ సర్వే పనులను రైతులు అడ్డుకున్నారు. తమ భూముల మీదుగా పైప్‌లైన్ వేస్తే మరింత నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ, మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే రావాడ రెవెన్యూ గ్రామ పరిధిలోని భూముల మీదుగా ఎన్‌టీపీసీ నుంచి వెళ్లే ఐదు హెచ్‌టీ లైన్ టవర్ లైన్లు ఏర్పాటుతో తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. టవర్ లైన్ల కారణంగా వ్యవసాయం పూర్తిగా చేయలేని పరిస్థితి ఏర్పడిందని, భూములను అమ్ముకునే అవకాశాలు కూడా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో గ్యాస్ పైప్‌లైన్ వేస్తే రైతుల జీవనాధారం పూర్తిగా పోతుందని పేర్కొన్నారు. గ్యాస్ పైప్‌లైన్ సర్వే పనులను వెంటనే నిలిపివేయాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి, టిడిపి నేతలు కోన రామారావు, వియ్యపు చిన్న, నాయకులు మధురాజు, రేఖ రామారావు, కోన చిన్నాయుడు, మోటూరు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు దోహదం

ప్రజాశక్తి-అనకాపల్లి : వికలాంగుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర సమగ్ర శిక్ష కన్సల్టెంట్ డాక్టర్ నరసింహం పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో జోనల్ స్థాయి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ సెలక్షన్ కార్యక్రమం స్థానిక ఎన్‌టీఆర్ స్టేడియం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహం మాట్లాడుతూ ఈ క్రీడల ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వికలాంగ బాలలకు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణకు అవసరమైన ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర క్రీడా విభాగం ప్రతినిధి శంకర్ మాట్లాడుతూ మొదట కడపలోనూ, తదుపరి లడాఖ్‌లోనూ శిక్షణ ఇచ్చి, అర్హత సాధించిన బాలలకు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త రామకృష్ణ, వివిధ జిల్లాల కోఆర్డినేటర్లు నీరజ, భాస్కర్, పి.గిరి ప్రసాద్ పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-వడ్డాది : అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసపత్రిలో చికిత్స తీసుకున్న బుచ్చయ్యపేట మండలం వడ్డాదికి చెందిన గండిపోయిన అభిలాష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.39,302 చెక్కును మంగళవారం ఆయన కుటుంబ సభ్యులకు స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దొండా నరేష్, టీడీపీ నేత దొండా రమేష్ పాల్గొన్నారు.

'సాగర్ సిమెంట్'లో పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాల బి.టెక్ 2, 3 సంవత్సరాల విద్యార్థులు అకడమిక్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా బయ్యవరంలోని సాగర్ సిమెంట్ కంపెనీలో మంగళవారం పారిశ్రామిక సందర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వైకుంఠరావు మాట్లాడారు. సందర్శన సమయంలో సాగర్ సిమెంట్స్ సాంకేతిక సిబ్బంది పరిశ్రమలో ప్రతి దశను వివరంగా వివరించారు. కార్యక్రమంలో సాగర్ సిమెంట్ ప్రతినిధులు పాండు రంగారావు, విభాగాధిపతి డాక్టర్ వి.భార్గవి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఆదర్శ రైతు అరుణకు పుడిమి పుత్ర అవార్డు

ప్రజాశక్తి-కశింకోట : ప్రకృతి వ్యవసాయం ద్వారా వివిధ రకాల పంటలను పండించి దిగుబడులను సాధించిన ఆదర్శ రైతు కశింకోట మండలం సుందరయ్యపేట గ్రామానికి చెందిన కూండ్రపు అరుణకు పుడమి పుత్ర అవార్డు లభించింది. మంగళవారం రెండు తెలుగు రాష్ట్రాల గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా నకిరేకల్‌లో పుడమి పుత్ర 2024 అవార్డును చైర్మన్ గున్నా రాజేంద్రరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ట్రస్టు ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి, కన్వీనర్ పావని తదితరులు అరుణకు అందజేశారు.

ఎంఎల్‌హెచ్‌పి దేవికి సన్మానం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తూ గ్రామ ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించిన బి.దేవిని మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌లో స్టాఫ్ నర్స్‌గా ఎంపిక కావడంతో ఎంఎల్‌హెచ్‌పీ బాధ్యతలకు రాజీనామా చేసి వియ్యంపేట గ్రామానికి వెళ్తున్న సందర్భంగా ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చల్లా నానాజీ, చల్లా కృష్ణవేణి పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విఎంఆర్‌డిఎలో కేక్ కట్ చేస్తున్న కమిషనర్ తేజ్ భరత్

ప్రజాశక్తి-అనకాపల్లి : మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ క్రైస్తవలకు, అధికారులు, సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, ఐక్యతకు ప్రతీక అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ శాఖ అధికారి సత్యపద్మ, ఎఓ రాధాకృష్ణ, మేనేజర్ భాస్కర్, ఏపీ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డిఎస్పి ఎం.శ్రావణి, ఫాస్టర్లు జాన్ పాల్, జపనీస్ శాస్త్రి, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.పి.జగదీశ్వరరావు అధ్యక్షతన డిఎంహెచ్ఓ సమావేశ మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది హాజరై ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రోగ్రాం అధికారుల చేత డిఎంహెచ్ఓ కేక్‌ను కట్‌చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లూసి, డాక్టర్ ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రీ క్రిస్మస్ వేడుకల్లో కమిషనర్ ఎన్.తేజ్ భరత్ కేక్ కట్ చేశారు. పరమత సహనం చాలా ముఖ్యమన్నారు, భారతదేశం సెక్యులర్ దేశమని గుర్తుచేశారు. జాయింట్ కమిషనర్ శ్రీరమేష్, ప్రధాన గణాంకాధికారి హరిప్రసాద్, ఎస్టేట్ అధికారి దయానిధి, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, బేతనీ సిటీ చర్చి పాస్టర్ సామ్యూల్ ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో..

పాయకరావుపేట : స్థానిక కనూస స్కూల్ ఆవరణంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫాదర్ మరియన్న క్రిస్మస్ గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు నృత్యాలు, స్కిట్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో మేనేజర్ థంకమ్ జాన్, ప్రిన్సిపల్ సిస్టర్ సంతాన థామస్, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ వేణి, సిస్టర్ సిలీ, సిస్టర్ నీలిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న విద్యాసంస్థలలో ముందస్తుగా మంగళవారం క్రిస్మస్ వేడుకగా ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో వేదికను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆ వేదికపై క్రీస్తు జననాన్ని కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించారు. మిరమిట్లు గొల్పే క్రిస్మస్ ట్రీస్, క్రిస్మస్ స్టార్స్ వేడుకలో పండగ కాంతులను వెదజల్లి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలువురు పిల్లలు క్రిస్మస్ తాత వేషధారణలో సాటి విద్యార్థులకు చాక్లెట్ పంచుతూ అలరించారు. కార్యక్రమాల్లో అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ సుమతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్లో మంగళవారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. స్కూల్ కరెస్పాండెంట్ బత్తుల అనురాధ విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం అనే నాటిక అందరినీ ఆకట్టుకుంది.

సెయింట్ జాన్స్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న దృశ్యం

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట, మండలం వడ్డాదిలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు అన్నారు. వడ్డాదిలో మంగళవారం నిర్వహించిన నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ వన సమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హత ఉన్న నాయీ బ్రాహ్మణులందరికీ ఇళ్ల స్థలాలు, ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక పిఎసిఎస్ చైర్మన్ దొండా నరేష్, నేతలు రమేష్, తలారి శంకర్, గురుమూర్తి, కనక, కాకినాడ శేషు, సింహాచలం, బిల్లకుర్తి హరినాథ్ పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి లంకెలపాలెం గొడ్డుపేట గ్రామంలో జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. అలాగే అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ ఉన్న పరిసరాలను జెసిబి సహాయంతో శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమాల్లో వార్డు అధ్యక్షులు కరణం జగదీష్, గల్లా రుద్రకుమార్, గళ్ళ సూర్యనారాయణ, ఎర్ర కోటేశ్వరరావు, దాసరి రామారావు, గణేష్, గోడ్డి శ్రీను పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని లక్కవరంలో మంగళవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు, పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి(ఈఓ) డాక్టర్ సజ్జా శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య మాట్లాడారు. కార్యక్రమంలో జెర్సీ, హెచ్‌ఎఫ్, ముర్ర, పుంగనూరు, ఒంగోలు, గిర్ వంటి వివిధ జాతులకు చెందిన 62 పెయ్యలను ప్రదర్శించారు. లేగ దూడల ప్రదర్శనలో జాతి లక్షణాలు వయసుకు తగ్గ బరువు ఆరోగ్య లక్షణాల ఆధారంగా మూడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శీరవరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కశింకోట : రామోకో సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గొబ్బురు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ సాంబమూర్తి వైద్య తనిఖీ నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి రవి కుమార్, మళ్ల బాబు, మళ్ల సూర్యరావు,పాల్గొన్నారు.

తాతయ్యబాబుకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం వడ్డాదిలో ఆయన స్వగ్రామం నేతలు రాకపోకలతో సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుండి టిడిపి నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వడ్డాదిలో తాతయ్య బాబును కలిసి సాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

చోడవరం : టిడిపి జిల్లా అధ్యక్షులుగా రెండవసారి నియమితులైన బత్తుల తాతయ్యబాబును చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం మాధవి రామప్పారావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేసి అభినందనలు తెలిపారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గోవాడ గ్రామంలో గత వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన కొండమీద 22 మంది లబ్ధిదారుల స్థలాలను కూడా సరైన ప్రదేశంలో ఇవ్వాలని తాతయ్య బాబును కోరారు.

యలమంచిలి టౌన్ : టిడిపి జిల్లా అధ్యక్షునిగా రెండో సారి నియమితులైన బత్తుల తాతయ్యబాబు స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాతయ్యబాబును చలపతి రావు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధూళి రంగనాయకులు, గొర్లె నానాజీ, ఆర్ఎస్ నాగేశ్వరరావు, ఆడారి ఆదిమూర్తి, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాతయ్యబాబును కలిసిన రామప్పారావు

తాతయ్యబాబును సత్కరిస్తున్న మాజీ ఎంపీ చలపతిరావు తదితరులు

వెంకన్న ఆలయాభివృద్ధికి టిటిడి నిధులు

● హోంమంత్రి అనిత చొరవతో రూ.5.46 కోట్లు మంజూరు

వివరాలు వెల్లడిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడంపై రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక దృష్టి సారించి, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి భారీ మొత్తంలో నిధులు మంజూరు చేయిచారని ఆలయ మాజీ చైర్మన్, నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు తెలిపారు.. మంగళవారం ఉపమాక వెంకన్న ఆలయ ప్రాంగణంలో మాట్లాడుతూ, టిటిడి చైర్మన్ బిఆర్.నాయుడు, ఇఒలతో హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడడంతో రూ. 5.46కోట్లు నిధులను ఉపమాక వెంకన్న ఆలయాభివృద్ధికి మంజూరు చేసి ప్రొసీడింగ్స్ ఇచ్చినట్లు వెల్లడించారు. మంజూరు చేసిన నిధులతో టిటిడి అధికారుల ఆధ్వర్యంలో గరుడాద్రి పర్వతంపైకి వెళ్లేందుకు మెట్లు మార్గం విస్తరణ, షెల్టర్ నిర్మాణానికి రూ.2.32కోట్లు, రాజగోపురం ఎదురుగా వార్షిక కల్యాణ వేదిక నిర్మాణానికి రూ.80 లక్షలు, ధ్వజస్తంభం చుట్టూ షెల్టర్ నిర్మాణానికి రూ.34 లక్షలు, వాహన మండపం మరమ్మతులకు రూ.10 లక్షలు, శిథిలంలో ఉన్న సత్రం భవనం తొలగించి వాటి స్థానంలో డార్మెటరీ, గదుల పునర్నిర్మాణానికి రూ.1.78కోట్లు భక్తులకు తాగునీరు సరఫరా, ప్రసాదాలు తయారీకి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ. 12 లక్షలు కేటాయించి, అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. వెంకన్న ఆలయాభివృద్ధిని నిధులు మంజూరుకు కృషిచేసిన రాష్ట్ర హోంశాఖమంత్రి వంగలపూడి అనితకు నిధులు మంజూరు చేసిన టిటిడి చైర్మన్ చైర్మన్ బి ఆర్ నాయుడు, ఇఒలకు ధన్యవాదాలు తెలిపారు.

2015 నవంబర్ 18న తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఉపమాక వెంకన్న ఆలయాన్ని టిటిడిలో విలీనం చేశారు.గడచిన పదేళ్లలో అరకొర పనులే తప్ప పెద్దగా ఆలయాభివృద్ధి జరగలేదన్నారు. ఇపుడు హోంమంత్రి అనిత కృషి, టిటిడి చైర్మన్ నాయుడు కృషితో పెద్దమొత్తంలో నిధులు కేటాయస్తూ ప్రొసీడింగ్స్ ఇవ్వడంపై టిడిపి నేతలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కె.నూకరాజు, కొప్పిశెట్టి జగదీశ్వరరావు(శ్రీను), వెలగా,శ్రీనివాసరావు, నానేపల్లి రాఘవ, వైబోయిన రమణ, గోసల చిన తాతారావు, అయినంపూడి అప్పలరాజు, ప్రగడ వీరబాబు, పెదపూడి శంకర్రావు, కొప్పిశెట్టి వాసు, తోలేటి శ్రీనివాస్, బద్ది చక్రయ్య, మత్తుర్తి వెంకటరమణ, పి గోవింద్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్లు ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలో దేవవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 34 మంది పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం స్టడీమెటీరియల్, మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పంపనబోయిన వెంకట్రావు, మండల గౌరవాధ్యక్షులు డిఆర్.కె శాస్త్రి కలిసి రూ.5 వేల ఆర్థిక సహాయంతో యుటిఎఫ్ తయారు చేయించిన టెన్త్ మోడల్ పేపర్స్‌ను పదవ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ పేపర్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళిక మేరకు విద్యార్థులు కష్టపడి చదివి శత శాతం ఉత్తీర్ణతకు సాధించాలన్నారు. విద్యార్థులకు మోడల్ పేపర్స్ అందించిన యుటిఎఫ్ నేతలు వెంకట్రావు, డిఆర్‌కె శాస్త్రి లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేమగిరి నూకరాజు, ఉపాధ్యాయులు, పెద్దలు అభినందనలు తెలిపారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ట్రాక్టర్లు

ప్రజాశక్తి - చీడికాడ : రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరిస్తూ, 24గంటల్లోనే ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుండడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలతోపాటు మండల కేంద్రంలోని వాసవి రైసుమిల్లు కేంద్రంగా ఈ ఏడాది ప్రభుత్వపరంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. పండించిన ధాన్యాన్ని అమ్ముకునే సౌకర్యం అందుబాటులోకి రావడం, వెంటనే డబ్బులు చెల్లిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వెంకన్నపాలెం, ముద్దుర్తి, బుచ్చయ్యపేట, ఇతర కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రాలు, రైసుమిల్లులకు ధాన్యం తరలించి అమ్ముకోవడానికి చాలా వ్యయప్రయాసలకు గురయ్యామని, ఈ ఏడాది అటువంటి పరిస్థితి లేదని రైతులు అంటున్నారు.

వచ్చే నెలలో వైద్యుల నియామకానికి చర్యలు

● వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్

రోగులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్

ప్రజాశక్తి -నక్కపల్లి : రాష్ట్రంలోని230 వైద్య విధాన పరిషత్, జిల్లా ఆస్పత్రుల్లో 150 మంది స్పెషలిస్టు వైద్యులు, 100 మంది ఎంబిబిఎస్ డాక్టర్లను జనవరి నాటికి భర్తీ చేస్తామనివైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్ అన్నారు. మంగళవారం నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. వార్డులు, టాయిలెట్స్, రోగులకు మందుల సరఫరా చేసే కౌంటర్‌లను పరిశీలించారు.

రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. మంచి భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సదరం క్యాంపు ను సందర్శించి, డాక్టర్ రవి కిరణ్ తో మాట్లాడారు. ఆయన కూడా ఓపి రాయించుకుని, వైద్య పరీక్ష చేయించుకుని మందులు తీసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు అనూషా, ఇషాక్, ఈశ్వర ప్రసాద్, హెడ్ నర్స్ వరలక్ష్మి, ఫార్మసిస్ట్ ఎస్ ఇమామ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ చైతన్య

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో రమణయ్యపేట, ముకుందరాజుపేట గ్రామాల్లో ఉపాధి హామీనిధులతో చేపడుతున్న ఎరువు గుంతలు, పశువుల షెడ్డుల నిర్మాణ పనులను మంగళవారం ఎంపిడిఒ బి చైతన్య పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సంపద తయారీ కేంద్రాన్ని, శానిటేషన్ పనులను పరిశీలించారు. సంపద తయారీ కేంద్ర నిర్వహణ పక్కాగా చేపట్టాలని, మురుగుకాలువల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. రమణయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధి ఎపిఒ భాగ్యలత పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై డ్రోన్లతో నిఘా

సూచనలు చేస్తున్న డిఎస్‌పి శ్రావణి

ప్రజాశక్తి- రావికమతం: గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేకదృష్టి సారించాలని అనకాపల్లి డిఎస్‌పి ఎం. శ్రావణి సూచించారు. మంగళవారం మండలంలో కొత్తకోట సర్కిల్ కార్యాలయం, రావికమతం పోలీస్ స్టేషనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. త్వరితగతిన పాత కేసుల విచారణ పూర్తి చేయాలని, వాహన ప్రమాదాల నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు గంజాయి అక్రమ రవాణా రహదారులను, అడ్డదారులను, ప్రత్యక్షంగా, డ్రోన్లు సహాయంతో పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాల, కళాశాలల్లోనూ, అలాగే గ్రామాలలో మహిళలపై నేరాలు, సైబర్ క్రైమ్ మత్తు పదార్థాల అనర్థాలపై తరచూ అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. కోడిపందాలు, జూదాలు, బెల్ట్ షాపుల నిర్వహణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. రానున్న పంచాయతీ ఎన్నికలు దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తరచూ పర్యవేక్షణ జరపాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తకోట సీఐ కోటేశ్వరరావు కొత్తకోట ఎస్ఐ శ్రీనివాసరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాతయ్యబాబుకు సత్కారం

తాతయ్యబాబును సత్కరిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి- రావికమతం: అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షులుగా నియమితులైన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబును రావికమతం మండలానికి వికలాంగుల హక్కుల సాధన కమిటీ నియోజకవర్గ కన్వీనర్ గెంజ శ్రీనివాసు (నెట్), తలాటం సూరిబాబు, టెలికం అడ్వైజర్ కమిటీ సభ్యులు గల్లా రాజేశ్వరరావు, పండూరి శ్రీను, గుడివాడ ఎంపిటిసి కరణం అప్పారావు తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. ఈ సందర్భంగా గంజి శ్రీనివాసు మాట్లాడుతూ టిడిపి జిల్లా అధ్యక్ష పగ్గాలు తాతయ్యబాబుకు అప్పగించడంతో పార్టీలోనూ, కార్యకర్తల్లోనూ, మంచి జోష్ వచ్చిందని, టిడిపికి మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కవగుంటలో ఉచిత వైద్య శిబిరం

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నళిని

ప్రజాశక్తి- రావికమతం: మండలంలోని కవగుంట గ్రామంలో రావికమతం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నళిని పుష్పలత ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 52 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో దీర్ఘకాలికంగా మంచానపడ్డ రోగులను వారి ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, సూచనలు, సలహాలు, చికిత్స అందించారు. సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు మాట్లాడుతూ గ్రామాలకు వైద్యులు వచ్చి శిబిరాలను నిర్వహించి వైద్యసేవలు అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. వృద్ధులు, వికలాంగులు ,మహిళలతోపాటు బిపి, సుగర్, ఇతర దీర్ఘకాలిక రోగాలు కలిగిన వ్యక్తులకు గ్రామంలోనే వైద్యసేవలు, మందులు అందించడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ప్రభ, డి.ఎ.మహేష్, ఆశ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమ వాహనంపై శ్రీనివాసుడు

తిరువీధుల్లో ఊరేగుతున్న వెంకన్న

ప్రజాశక్తి- నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆంజనేయ వాహనంపై శ్రీనివాసుడు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి ,భూదేవి సమేత వెంకన్న ఉత్సవ మూర్తులను ఆంజనేయ వాహనం , గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకిలో అధిష్టింప చేసి మాడవీధుల్లో అర్చక బృందం ఆధ్వర్యంలో తిరువీధి సేవ నిర్వహించారు. ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, నండూరిరాజ గోపాలాచార్యులు, పవన్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

కార్మికోద్యమాల సారథి సిఐటియు

కార్మికోద్యమాల సారథి సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం కోసం ఉమ్మడి విశాఖ జిల్లాలో మంగళవారం ప్రచారం హోరెత్తింది. ఊరూ..వాడా సాగిన ఈ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. తమకు తోచిన విరాళమిచ్చి మహాసభ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. జనవరి 4న జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు కుటుంబ సమేతంగా తరలివస్తామని కార్మికులు మాటిచ్చారు.

- అఖిల భారత మహాసభ జయప్రదానికి హోరెత్తుతున్న ప్రచారం
- విశాఖలో మహిళల ర్యాలీ - మద్దిలపాలెంలో ఫొటో ఎగ్జిబిషన్
- అనకాపల్లిలో కొనసాగుతున్న జాతా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న విశాఖ జిల్లాలో కార్మిక హక్కుల రక్షణ కోసం తలపెట్టిన ఉద్యమాలకు సిఐటియు సారథిగా నిలిచిందని ఆ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. మంగళవారం ఉదయం సంఘం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో బస్ స్టాప్ వద్ద విశాఖ కార్మికోద్యమం, జాతీయోద్యమ ఘట్టాలతో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఐటియు ఏర్పడిన 55 ఏళ్ల కాలంలో విశాఖలో జరిపిన కార్మికోద్యమాల చరిత్రను తెలియజేసే విధంగా ఏర్పాటు చేసిన ఈ ఫొటో ఎగ్జిబిషన్ ప్రజలను ఆకట్టుకుంటోందన్నారు. ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు శ్రామిక ఉత్సవ్ పేరుతో ఆర్‌కె.బీచ్‌లో ఉన్న ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సాంస్కృతిక కళా ప్రదర్శనలు, సైన్సు ఎగ్జిబిషన్, ఫొటో ఎగ్జిబిషన్, షార్ట్ ఫిల్మ్ ప్రదర్శన, సాహిత్య, పుస్తక ప్రదర్శన వంటివి జరుగుతాయన్నారు. పలువురు సినీ ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, నాయకులు ఎంసిహెచ్.అప్పడు, ఎ.సీతాలక్ష్మి, పిఎస్.నారాయణ, కె.కుమారి, అనపర్తి అప్పారావు, పీతల అప్పారావు, ఎ.సింహాచలం, జెఆర్.నాయుడు, సత్యన్నారాయణ రాజు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ ప్రచార జాతా

యలమంచిలిటౌన్ : సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ అచ్యుతాపురం మండల కేంద్రం, ఎస్ఈజెడ్‌లో మంగళవారం ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, మండల కన్వీనర్ కె.సోము నాయుడు మాట్లాడుతూ సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో సిఐటియు ఆవిర్భవించి 55 సంవత్సరాల కాలంలో మొదటిసారి జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలకు 2000 మంది ప్రతినిధులు అన్ని రాష్ట్రాల నుండి హాజరవుతారన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈ మహాసభల్లో చర్చించి భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని చెప్పారు. మహాసభ ముగింపు సందర్భంగా జనవరి 4న విశాఖ ఆర్కే బీచ్‌లో జరుగు భారీ బహిరంగ సభకు కార్మికులు, ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తటా రాజు, వై మురళి, పి శ్రీను, ఆర్ సత్తిబాబు, ఎల్ రామారావు, పి వెంకట్రావు, ఎల్ గణేష్, ఎల్ నర్సింగరావు, సత్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజంగా మహిళల ప్రచార ర్యాలీ

విశాఖ కలెక్టరేట్ : సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్‌లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సిఐటియు కార్యాలయం నుంచి మహిళలు ర్యాలీగా జగదాంబ జంక్షన్‌కు చేరుకొని అక్కడ నుంచి క్లాక్ టవర్, లేపాక్షి జంక్షన్ మీదుగా జగదాంబ థియేటర్ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి మాట్లాడుతూ రాబోయే కాలంలో కార్మిక వర్గ పోరాటాలకు దిశా నిర్దేశం చేయబోయే ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిఐటియు అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల శ్రామిక మహిళల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, పేదరికం, నిరుద్యోగం, చాలీచాలని వేతనాలు, అధిక ధరలు, మద్యం మహమ్మారికి బానిసలుగా మారుతున్న మగవారి వల్ల ఆర్థిక భారాలు పెరుగుతున్నాయని తెలిపారు. మహిళలు కూడా పని చేస్తే తప్ప కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందన్నారు. ఇంటా బయటా అనేక ఒత్తిళ్లకు గురవుతూ మహిళలు శ్రమిస్తున్నా వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కడం లేదన్నారు. మహిళలకు పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు, వివక్షత సాధారణమయ్యాయన్నారు. పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం అధికార మదంతో 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల పరిస్థితిని మరింత ప్రమాదంలోకి నెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో సిఐటియు కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతోందని, భవిష్యత్తులో మరింత బలోపేతం కావడానికి అఖిలభారత మహాసభ నిర్ణయాలు, కార్యాచరణ దోహదపడతాయని అన్నారు. ప్రజానీకం యావత్తు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు బి.పద్మ, డి.కొండమ్మ, ఆర్.విమల, బి.రమణి, వి.ప్రభావతి, సిహెచ్.సుమిత్ర, కె.మణి, కె.సంతోషం, కమల, జి.మణి, మౌనిక, మమత, మంగ వేణి, సత్యవతి, స్వర్ణలత, పుష్ప పాల్గొన్నారు.

మునగపాకలో సిఐటియు జెండా ఆవిష్కరణలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

మద్దిలపాలెం బస్‌స్టాప్ వద్ద ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

మహాసభను విజయవంతం చేయాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఈ నెల 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు జరుగు సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. గోపాలపట్నం పెట్రోల్ బంకు వద్ద నిర్వహించిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయాలనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలకు వ్యతిరేకంగా ఈ మహాసభలో పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామని చెప్పారు. మహాసభలో భాగంగా ఈ నెల 27వ తేదీ నుండి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, ప్రముఖ సినీ నటుడు ప్రకాష్‌రాజు హాజరవుతారని తెలిపారు. 4వ తేదీ బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరై విజయన్ హాజరవుతారని, ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు గోపాలపట్నం జోన్ ప్రధాన కార్యదర్శి బలివాడ వెంకటరావు, నాయకులు పల్లా అనసూయ, జక్కాయన సత్యనారాయణ, నాని, సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్ పాల్గొన్నారు.

28 నుంచి సాహిత్య సందడి

హాజరుకానున్న ప్రముఖ కవులు, రచయితలు

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంవిఎస్.శర్మ, చీకటి దివాకర్ తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న విశాఖ శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా తలపెట్టిన సాహిత్య కార్యక్రమాలు ఈ నెల 28 నుండి జనవరి 2 వరకు బీచ్ రోడ్‌లోని ఎయు కన్వెన్షన్ హాల్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సాహిత్య కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ శ్రమ విలువను సమాజం సరిగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ అభివృద్ధి వెనుక శ్రమజీవుల కష్టం, త్యాగం దాగి ఉన్నాయని తెలిపారు. అయినా వారి జీవితం, సమస్యలు తరచూ నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే శ్రమజీవుల జీవన అనుభవాలను, వారి ఆలోచనలను, ఆశయాలను సాహిత్య రూపంలో ప్రజల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఏడు రోజుల పాటు సాహిత్య కార్యక్రమాలను రూపొందించామని తెలిపారు. శ్రమ - సాహిత్యం కలిసినప్పుడే సమాజ చైతన్యం పెరుగుతుందని, ఆలోచనల మార్పుకు అది దోహదపడుతుందని అన్నారు. చీకటి దివాకర్ మాట్లాడుతూ శ్రమపై రచనలు చేసే కవులు, రచయితలు వారి అనుభవాలను, సమాజంపై శ్రమ ప్రభావాన్ని కవితలు, గేయాలు, ప్రసంగాల ద్వారా వ్యక్తపరుస్తారని తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిగే శ్రమ కవనంలో వంద మంది కవులు, గాయకులు పాల్గొంటారన్నారు. ఇది శ్రమజీవుల గొంతుకగా నిలుస్తుందని చెప్పారు. అలాగే ఏడు రోజుల పాటు కవితా పఠనం, ప్రసంగాలు, సాహిత్య చర్చల ద్వారా శ్రమ - సాహిత్యం - సమాజం మధ్య ఉన్న సంబంధాన్ని ప్రజలకు చేరువ చేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని వివరించారు. సుమారు 400 మంది కవులు, రచయితలు ఈ వారం రోజుల్లో పాల్గొంటారని చెప్పారు. ముఖ్యంగా రచయిత, సామాజిక రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, వల్లూరి శివప్రసాద్, ఆచార్య ధనరాజ్, గంటేడ గౌరునాయుడు, డివి.సూర్యారావు, అట్టాడ అప్పలనాయుడు, కత్తి పద్మ, జాలాది విజయ, నల్లి ధర్మారావు వంటి ముఖ్యులు హాజరుకానున్నారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కవులు, రచయితలు, సాహిత్యకారులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జివిఎన్.చలపతి, చీకటి చంద్రికా రాణి, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

నేడు అనకాపల్లిలో శ్రామిక ఉత్సవ్

అనకాపల్లి : సిఐటియు అఖిలభారత 18వ మహాసభల సందర్భంగా అనకాపల్లి స్టేట్ బ్యాంకు వద్ద బుధవారం సాయంత్రం 4 గంటల నుండి జరుగు శ్రామిక ఉత్సవాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివి.శ్రీనివాసరావు, ఆర్ శంకర్రావు, ఉపాధ్యక్షులు గంట శ్రీరామ్ పిలుపునిచ్చారు. ఈ ఉత్సవంలో కార్మికులు, విద్యార్థుల పాటలు, నృత్యాలు ఉంటాయని, ఆసక్తిగల స్కూలు పిల్లలు వచ్చి ప్రదర్శనలు చేయవచ్చని తెలిపారు. సిఐటియు అఖిల భారత మహాసభలు ఈ సందర్భంగా అన్ని ప్రాంతాల్లో శ్రామిక ఉత్సవాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.